నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, మంగళవారం 13 ఆగస్టు 2024 | NIZAMABAD

## విద్యారంగ సమస్యలపై..




పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ విద్యార్థి మోర్చా ఆధ్వర్యంలో సోమవారం కామారెడ్డిలో చలో కలెక్టరేట్ నిర్వహించారు. ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. –కామారెడ్డి,ఆగస్టు12

రోజురోజుకూ రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

- పోలీసు అధికారులమంటూ వీడియోకాల్స్
- మీ అబ్బాయిపై కేసు ఉందంటూ బెదిరింపులు
- అమాయకులను భయభ్రాంతులకు గురిచేస్తున్న వైనం
- అవగాహనా రాహిత్యంతో డబ్బులు పోగొట్టుకుంటున్న ఉమ్మడి జిల్లావాసులు
- నాలుగు నెలల్లో సుమారు 150 కేసులు నమోదు
- ఆందోళనలో ఉమ్మడి జిల్లావాసులు



# కాల్‌చేసి.. కట్టుకథ చెప్పి..

### ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు

- జక్రాన్‌పల్లి మండలం పడగల్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి సైబర్ మోసగాళ్లు ఫోన్ చేశారు. మీ కుమారుడిపై పోలీసు కేసు ఉందని, తమ ఆధీనంలో ఉన్నాడని విడిచిపెట్టాలంటే డబ్బులు ఇవ్వాలంటూ ఓ తండ్రిని బెదిరించారు.దీంతో అతడు సైబర్ నేరగాళ్లు చెప్పిన అకౌంట్‌కు రూ.95 వేలు పంపించాడు.
- ఏర్గట్ల మండలం తడ్‌పాకల్ గ్రామానికి చెందిన ఓ మహిళకు ఫోన్ చేసి.. దుబాయిలో ఉన్న మీ భర్త మా అదుపులో ఉన్నాడని,అతడిని వదిపెట్టాలంటే రూ.50వేలు పంపించాలంటూ డిమాండ్ చేశారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఆశ్రయించింది.

**నాలుగు నెలల్లో సుమారు 150 కేసులు నమోదు**

- నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నాలుగు నెలల క్రితం సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. తొలి మూడు నెలల్లో 42 కేసులు నమోదు కాగా రూ.2కోట్ల వరకు బాధితుల నుంచి మోసగాళ్లు కాజేశారు. వీటిలో సుమారు 25 కేసులను పోలీసులు ట్రేస్ చేసి రూ.కోటి వరకు రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. ఇటీవల సైబర్ నేరాల సంఖ్య పెరిగిపోవడంతో కేసులు త్వరితగతిన ఛేదించడం కష్టసాధ్యంగా మారింది. దీంతో రూ.7లక్షలకుపైగా మోసం జరిగితే సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో, అంతకన్నా తక్కువ ఉంటే సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.

### గోల్డెన్ అవర్..

సైబర్ మోసాన్ని గుర్తించిన వెంటనే లేదా అనుమానించిన వెంటనే గోల్డెన్ అవర్‌లో నివేదించడం చాలా ముఖ్యం. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నిందితుడి బ్యాంకు అకౌంట్లు, డిజిటల్ వ్యాలెట్ల నుంచి కాజేసిన సొమ్ము మొత్తాన్ని స్తంభింపజేయడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయి. దీంతో బాధితులకు రీఫండ్ సులభతరం అవుతుంది. ఎవరైనా ఆన్‌లైన్ మోసాల బారినపడినప్పుడు 1930 నంబర్‌కు, సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో గానీ cybercrime. gov. inవెబ్‌సైట్‌లోగానీ ఫిర్యాదు చేయాలి.

– ఎండీ. ముఖీద్ పాషా, సీఐ, సైబర్‌క్రైం స్టేషన్

### ఉద్యోగం పేరిట రూ.1.38లక్షలు స్వాహా

బాన్సువాడ రూరల్, ఆగస్టు 12: ఉద్యోగం పేరిట సైబర్ నేరగాళ్లు మోసం చేయడంతో బాన్సువాడ మండలంలోని తాడ్కోల్ గ్రామానికి చెందిన అంకం విష్ణువర్ధన్ రూ.1.38లక్షలు పోగొట్టుకున్నాడు. బాన్సువాడ సీఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం అంకం విష్ణువర్ధన్ ఆన్‌లైన్‌లో ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. జూలై 29న డాటా ఎంట్రీ ఉద్యోగం వచ్చిందని సైబర్ నేరగాళ్లు వాట్సాప్‌లో లింకు పంపించారు. ఈ నెల 10న యువకుడు వివరాలు పూర్తిచేసి పంపించాడు. దీంతో నీ వల్ల మా సంస్థకు నష్టం వాటిల్లిందని సైబర్ నేరగాళ్లు ఫోన్‌లో బెదిరింపులకు దిగారు. రిజిస్ట్రేషన్ చార్జీల పేరిట డబ్బులు డిమాండ్ చేయగా వారి మాటలు నమ్మి విడుతల వారీగా రూ.1.38లక్షలు వారి బ్యాంకు ఖాతాలో జమ చేశారు. చివరికి మోసపోయినట్లు గుర్తించి 1930 నంబర్‌కు ఫోను చేసి ఫిర్యాదు చేశాడు.

### రూటు మార్చిన కేటుగాళ్లు

'మీ అబ్బాయి డ్రగ్స్ కేసులో పట్టుబడ్డాడు... మీ అమ్మాయి పెద్ద కేసులో మా అదుపులో ఉన్నది.. మీ భర్తపై కేసు నమోదై ఉన్నది.. రూ.లక్ష పంపిస్తే వదిలిపెడతాం. లేకపోతే జైలు ఊచలు లెక్కిస్తారు... కావాలంటే మీ వాళ్లతో మాట్లాడండి' అంటూ అమాయకులపై వల విసురుతున్నారు సైబర్ నేరగాళ్లు. అచ్చం బాధితుల కుమారుడు/కుమార్తె మాట్లాడినట్లుగానే వాట్సాప్ కాల్‌లో ఆడియో విని పిస్తూ కోట్లు వసూలు చేస్తున్నారు. వాట్సాప్ కాల్ డీపీలో ఓ పోలీసు ఉన్నతాధికారిలా ఫొటో కనిపిస్తుండడంతో నిజమేమోనని డబ్బులు పంపిస్తున్నారు. తీరా మోసపోయామని గ్రహిస్తున్న బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఇలాంటి ఘటనలు ఇటీవల అనేకం చోటు చేసుకున్నాయి.

– వినాయక్‌నగర్, ఆగస్టు 12

### గుర్తుంచుకోండి..

- మీపై కేసులు ఉన్నాయి.. మీ కొడుకు/కూతురు పెద్ద కేసులో చిక్కుకున్నారు.. కేసు నుంచి తప్పించాలంటే డబ్బులు పంపండి అని వచ్చే వాట్సాప్ కాల్స్‌ను ఎట్టిపరిస్థితుల్లో నమ్మొద్దు.
- బ్యాంకు ఖాతాలకు ఫోన్ నంబర్, ఆధార్ నంబర్ లింక్ చేయాలంటూ నేరగాళ్లు మోసం చేస్తున్నారు. బ్యాంకుకు వెళ్లి నిర్ధారించుకోవాలి. గానీ ఇతరులను గుడ్డిగా నమ్మి మోసపోవద్దు.
- పార్ట్‌టైం ఉద్యోగాలు, వర్క్ ఫ్రం హోం, కొరియర్ల పేరిట గుర్తు తెలియని వ్యక్తులు, సంస్థల నుంచి వచ్చే మెస్సేజ్‌లు, ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దు.
- వాట్సాప్‌లో పంపిన క్యూఆర్ కోడ్ ఓపెన్ చేసి వివరాలు పంపాలంటూ పలువురికి మెస్సేజ్‌లు వస్తున్నాయి. ఇవి కూడా సైబర్ నేరగాళ్లే పంపుతున్నారని గుర్తుంచుకోవాలి.
- మీరు లాటరీలో డబ్బులు గెలిచారంటూ మెస్సేజ్ పంపుతుంటారు. వాటిని నమ్మొద్దు.

### లింకులు నమ్మొద్దు..

సైబర్ మోసగాళ్లు కొత్త తరహాలో మోసాలకు పాల్పడుతున్నారు. మరో రెండు రోజుల్లో స్వాతంత్ర్య దినోత్సవం ఉన్నందున సైబర్ నేరగాళ్లు మీ మొబైల్ ఫోన్లకు హ్యాపీ ఇండిపెండెన్స్ డే అంటూ లింకులు పంపిస్తుంటారు. అలాంటి వాటిని ఎవ్వరూ నమ్మొద్దు. లింకులను ఓపెన్ చేస్తే బ్యాంకు ఖాతాలో ఉండే డబ్బులు మాయం అవుతాయి. జాగ్రత్తగా ఉండండి.



- నరహరి, సీఐ, నిజామాబాద్

# పైసలిచ్చినా పని చెయ్యలె..

- ఆర్నెల్లుగా తిరిగి వేసారిన రైతు
- పట్టా చేయడం లేదని అన్నదాత ఆవేదన
- పార్ట్-బీ పేరు చెప్పి దండుకున్న అధికారులు
- 'ప్రజావాణి'లోనే ఆత్మహత్యాయత్నం



అంజయ్యను దవాఖానకు తరలిస్తున్న 108 సిబ్బంది

పెద్దకొడప్‌గల్, ఆగస్టు 12: రెవెన్యూ అధికారుల ధనదాహానికి రైతులు బలవుతున్నారు. ఏ పని కావాలన్నా డబ్బులు గుంజుతున్నారు. పైసలు తీసుకున్నాక పని చేయకుండా సతాయిస్తున్నారు. ఆఫీసుల చుట్టూ తిరిగి తిరిగి అన్నదాతలు విసిగి పోతున్నారు. ఈ క్రమంలోనే తీవ్ర ఆవేదనకు గురైన ఓ రైతు సోమవారం పెద్దకొడప్‌గల్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సోమవారం అధికారులు ప్రజావాణి నిర్వహిస్తుండగా, పురుగుల మందు తాగాడు. కలకలం రేపిన ఈ ఘటనతో రెవెన్యూ అధికారుల దోపిడీ మరోమారు తెరపైకి వచ్చింది. పనుల కోసం వచ్చే వారిని పీడించుకుంటున్న తింటున్న వైనంపై జోరుగా చర్చ సాగుతున్నది.

### రేపు, మాపు అంటూ..

పెద్దకొడప్‌గల్ మండలం వడ్లం గ్రామానికి చెందిన జీపీ కార్మికుడు గైని అంజయ్య కుటుంబానికి గ్రామ శివారులోని సర్వే నం.134/3లో 3.14 ఎకరాల భూమి ఉంది. అన్నదమ్ముల పేరిట ఉన్న ఆ భూమిని తన పేరిట చేయాలని అంజయ్య ఆర్నెళ్ల క్రితం ఆర్‌ఐ పండరి వద్దకు వెళ్లాడు. ఆ సర్వే నంబర్‌కు సంబంధించిన భూమి వివాదాస్పద (పార్ట్-బీ) జాబితాలో ఉందని అధికారి భయపెట్టాడు. రూ.20 వేలు ఇస్తే పార్ట్-బీ నుంచి తొలగించి పట్టా చేసిస్తానని ఆర్‌ఐ చెప్పాడు. దీంతో అక్కడ ఇక్కడ అడిగి అప్పు చేసి ఆ మొత్తాన్ని అంజయ్య గత ఫిబ్రవరిలోనే అధికారి చేతిలో పెట్టాడు. సొమ్ము తీసుకున్న సదరు రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తూ ఆర్నెళ్లు గడిపాడు. పనులన్నీ వదిలేసి అంజయ్య ఆఫీస్ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఎప్పుడు వెళ్లినా రేపు, మాపు అంటూ సమాధానమే వస్తున్నది. దీంతో విసిగిపోయిన ఆయన అధికారుల తీరుపై జూలై 31న ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. అయినప్పటికీ స్పందన లేదు. ఆఫీసుల చుట్టూ తిరిగి తిరిగి, చేతిలో డబ్బుల్లేక ఇబ్బందులు పడుతున్న అంజయ్య అలసిపోయాడు. సోమవారం మండలాఫీసులో ప్రజావాణి కార్యక్రమం నడుస్తుండగానే, పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అక్కడే ఉన్న కొందరు వెంటనే అతడ్ని స్థానిక దవాఖానకు, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం బాన్సువాడకు తరలించారు.

### డబ్బుల విషయం తెలియదు..

అంజయ్య దరఖాస్తు చేసింది వాస్తవమేనని తహసీల్దార్ దశరథ్ తెలిపారు. పార్ట్-బీలో ఉండడంతో పట్టా మార్పిడి ఇప్పుడైతే కాదు, తర్వాత చేద్దామని చెప్పానన్నారు. డబ్బులు తీసుకున్న విషయం తన దృష్టికి రాలేదని,ఉన్నతాధికారులకు నివేదిస్తానన్నారు.

### వరండాలోనే వైద్యం..

బోధన్ జిల్లా ప్రభుత్వ దవాఖాన రోగులతో కిక్కిరిసిపోతున్నది. దీంతో ఆయా వార్డులన్నీ రోగులతో నిండిపోవడంతో వైద్యం కోసం వచ్చిన వారిని ఇలా వరండాలో బెడ్లు వేసి సేవలందిస్తున్నారు. దవాఖానకు సోమవారం పెద్ద సంఖ్యలో రోగులు రావడంతో సరైన సౌకర్యాలు లేక వరండాలోనే వైద్య సేవలందించారు ఇక్కడి సిబ్బంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి దవాఖానలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

– శక్కర్‌నగర్, ఆగస్టు 12



బోధన్ జిల్లా ప్రభుత్వ దవాఖానలో గదులు ఖాళీలు లేక వరండాలో బెడ్లపై చికిత్స పొందుతున్న రోగులు

- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- డిప్యుటేషన్‌పై నియమించినా సక్రమంగా సాగని బోధన
- విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన

# చదువులెట్ల సాగాలె..

### 170 మందికి ఇద్దరే ఉపాధ్యాయులు..



ఉర్దూ మీడియం పాఠశాల గదిలో టీచర్ లేక ఖాళీగా ఉన్న కుర్చీ

రెంజల్, ఆగస్టు 12: రెంజల్ మండలం కందకుర్తి గ్రామంలోని ఉర్దూ మీడియంలో పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు 170 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి పాఠాలు బోధించేందుకు తొమ్మిది మంది ఉపాధ్యాయులు అవసరం ఉండగా ఇక్కడ కేవలం ఇద్దరు మాత్రమే విధులు నిర్వర్తిస్తుండడం గమనార్హం. పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ఉపాధ్యాయుల కొరత వేధిస్తుండడంతో సిలబస్ పూర్తికాక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ పాఠశాలను ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సందర్శించగా ఉపాధ్యాయుల కొరత తీర్చాలని తల్లిదండ్రులు విన్నవించారు. అయినా సమస్య ఇప్పటి వరకు పరిష్కారానికి నోచుకోలేదు. ఇటీవల డీఈవో ఐదుగురు ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై పంపించగా.. ఇందులో కేవలం ఇద్దరు మాత్రమే ఉపాధ్యాయులు విధులకు హాజరవుతున్నారు. ఇదిలా ఉండగా ఈ పాఠశాలను మాజీ ఎంపీ కవిత ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేసిన విషయం తెలిసిందే.

### ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలి..

పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా విద్యార్థుల సిలబస్ పూర్తికాలేదు. విద్యార్థులు ఇప్పటి వరకు తెలుగు, గణితం, ఫిజికల్‌సైన్స్, బయోసైన్స్, ఇంగ్లిష్ పుస్తకాలను పట్టలేదు. ఇలాగే వదిలేస్తే ఉత్తమ ఫలితాలు కష్టమే. బోధన్ ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి.

- హసీనా బీ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్, కందకుర్తి



# పీహెచ్‌సీకి వైద్యులు, సిబ్బంది నియామకం

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

పెద్దకొడప్‌గల్, ఆగస్టు 12: పెద్దకొడప్‌గల్ పీహెచ్‌సీకి సుస్తి అనే శీర్షికతో నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వైద్యులు, సిబ్బంది లేక రాత్రిపూట రోగులు, అత్యవసర సమయాల్లో వైద్య సేవలకు కలుగుతున్న ఇబ్బందులపై కథనం ప్రచురితమైంది. దీంతో పీహెచ్‌సీకి ఒక మెడికల్ ఆఫీసర్, ఇద్దరు స్టాఫ్ నర్సులను నియమించినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విద్య తెలిపారు. సోమవారం దవాఖానను పరిశీలించిన ఆమె 24గంటలు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందిస్తామన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విద్య

# వైన్స్‌లో నిల్.. బెల్టులో ఫుల్..

- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ శాఖ
- ఫిర్యాదులు వస్తున్నా పట్టింపు కరువు
- ఛిద్రమవుతున్న సామాన్య కుటుంబాలు
- తెర వెనుక ఆబ్కారీ యంత్రాంగమే మద్దతు
- మద్యం దుకాణాలకు రెట్టింపు సంఖ్యలో బెల్ట్‌షాపులు

### విచ్చలవిడిగా బెల్ట్ షాపులు



నిజామాబాద్, ఆగస్టు 12(నమస్తే తెలంగాణ ప్రతినిధి): మద్యం అక్రమ అమ్మకాలకు అడ్డూ అదుపు లేకుండా పోతున్నది. విచ్చలవిడి విక్రయాలతో ఉభయ జిల్లాల్లోని పల్లెల్లో మద్యం ఏరులై పారుతున్నది. పచ్చని పల్లెలన్నీ చీకటి పడితే... బెల్టు దుకాణాల్లో దొరికే మద్యం బాటిళ్లతో ఆగమాగం అవుతున్నాయి. మద్యం దుకాణాల సంఖ్య మండలానికి ఒకటి నుంచి సరాసరి మూడు దుకాణాల వరకూ విస్తరిస్తే... బెల్టు దుకాణాలు మాత్రం అందుకు రెట్టింపు స్థాయిలో విస్తరించి అమ్మకాలు జరుపుతున్నాయి. మద్యం వ్యాపారంలో ఆరితేరిన వారు ఇందులో ప్రధాన పాత్రను పోషిస్తున్నారు. మద్యం దుకాణాల వేలంలో అవకాశం దక్కని వారంతా బెల్టు దుకాణాల ద్వారా అక్రమంగా అమ్మకాలు జరుపుతూ ప్రజలను నిలువు దోపిడీకి గురిచేస్తున్నారు. 10 నుంచి 15శాతం మేర అధికంగా ధరను ఆపాదించి బాటిళ్లు విక్రయిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పల్లెల్లో బెల్టు దుకాణాలన్నీ విచ్చలవిడిగా పెరిగినా పోలీసు, ఆబ్కారీ శాఖ అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బెల్టు షాపులతో పేద కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయంటూ రేవంత్ రెడ్డి గతంలో తీవ్రంగా గొంతు విప్పారు. కానీ, సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విచ్చలవిడితనంపై నియంత్రణే చేయడం లేదు.

### వైన్ షాపుల దుర్బుద్ధి...

మద్యం వ్యాపారం మూడు పువ్వులు... ఆరు కాయలు అన్న చందంగా మార్చుకునేందుకు వైన్స్ దుకాణాల యాజమాన్యాలు సిండికేట్‌గా మారినట్లుగానూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకోసం స్థానిక పోలీసులు సైతం సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లుగా సమాచారం. తెర వెనుక ఆబ్కారీ శాఖ అధికారులు వంత పాడుతుండడంతో ఈ తంతు సాఫీగా సాగిపోతున్నది. మొన్నటి వేసవికాలంలో వైన్స్‌లో బీర్ల కొరత వేధించగా బెల్టుషాపుల్లో మాత్రం అధిక ధరలకు సులువుగా లభించాయి. బెల్ట్‌షాపు నిర్వాహకులను పావుగా మార్చుకొని విక్రయించిన బాటిళ్లపై కమీషన్ పొందుతున్నట్లుగా ఆరోపణలున్నాయి. మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ధరలకే విక్రయించాల్సి ఉంటున్నందున కల్పిత కొరతతో అధిక లాభాలను బెల్టు దుకాణాల ద్వారా వ్యాపారులు ఆర్జిస్తున్నారు.

### తెర వెనుక మతలబు..?

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం విక్రయాలు జోరుగా పెరుగుతున్నాయి. సరాసరి ప్రతి నెలా రూ.వంద కోట్ల నుంచి రూ.200 కోట్ల వరకు వ్యాపారం నడుస్తున్నదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఎన్నికల సందడిలో భాగంగా గతేడాది డిసెంబర్‌లో 2లక్షల విస్కీ కేసులు, 2.67లక్షల బీర్ కేసులు అమ్ముడవ్వగా వీటి విలువ రూ.200కోట్లుగా ఉన్నది. ఇక ఈ ఏడాది ప్రారంభం జనవరిలో 1.40లక్షల విస్కీ కేసులు, 2లక్షల బీర్ కేసులు విక్రయాలు నమోదు కాగా వీటి మొత్తం విలువ రూ.136కోట్లు గా తేలింది. జూన్ నెలలో రూ.142కోట్లు మద్యం అమ్ముడైంది. ఇందులో 1.32లక్షల విస్కీ కేసులు, 3లక్షల బీర్ కేసులు విక్రయాలు జరిగాయి. జూలైలోనూ రూ.150 కోట్లు మేర వ్యాపారం జరిగినట్లుగా స్పష్టమవుతున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా రూ.1200 కోట్ల మేర మద్యం విక్రయాలు జరిగాయి. వైన్‌షాపుల్లో నిర్ణీత వేళలోనే మద్యం అమ్మకాలు జరుగుతుండగా బెల్టు షాపులకు పరిమితి, నియంత్రణ అంటూ ఏదీ లేదు. ఎప్పుడు కావాల్సి వస్తే అప్పుడు ఎంచక్కా కోరుకున్న బాటిల్ లభిస్తుండడం వెనుక ఆబ్కారీ శాఖ అధికారుల మద్దతు కూడా ఉన్నట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి.

### సమాచారం ఇస్తే దాడులు చేస్తాం..

ఎన్నికల సమయంలో ఈసీ ఆదేశాలతో విస్తృతంగా దాడులు నిర్వహించి బెల్టు షాపులను మూసేశాం. ఎక్కడైనా బెల్టు షాపులను తెరిస్తే మాత్రం ఊరుకునేది లేదు. దాడులు నిర్వహించి మూసేస్తాం. ప్రభుత్వం నుంచి లైసెన్సు పొందిన దుకాణాల్లోనే మద్యం అమ్మకాలు జరగాలి. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే బెల్టు షాపులపై ప్రజలెవరైనా సమాచారం ఇస్తే తప్పకుండా దాడులు చేసి అరికడతాం.

- సోమిరెడ్డి, డిప్యూటీ కమిషనర్, ఆబ్కారీ శాఖ